# ఉభయతారకం



రామారావుగారి పెద్దమ్మాయి పెళ్ళికి ఎదిగి ఉంది.

ఆయన డైరీ కార్పొరేషన్‌లో ఉన్నతాధికారి. పైగా- లక్షాధికారి. అయినా... ఎంగిలిచేత్తో కూడా కాకిని తరిమే రకం కాదు. ఆయనదంతా వన్‌వే ట్రాఫిక్. 'మా ఇంటికొస్తే నాకేం తెస్తావు? మీ ఇంటికొస్తే నాకేం పెట్టావ్?' అనే రకం. ఒక మహానటుడిలాగా ఇప్పించటమే కాని, ఇచ్చుట ఎరుగని మహా మహిమాన్వితుడు ఆయన.

"ఏమండీ... నారాయణరావుగారి భార్య ప్రొద్దున వచ్చింది. వాళ్ళకి ఒక్కగానొక్క కొడుకు. బోలెడు ఆస్తి. వాళ్ళకి మన అమ్మాయిని చేసుకోవాలని ఉంది" అంది రాజ్యం.

"అవునవును. అది మంచి సంబంధమే! నేనూ కదలేయాలనుకుంటున్నాను."

"కాని, ఏం ప్రయోజనం? వాళ్ళకి లక్ష తక్కువ కాకుండా కట్నం కావాలి. మనమేం ఇవ్వగలం? ఆ లక్ష తప్పిస్తే దీన్ని మించిన లక్షణమైన సంబంధం మరోటి లేదు."

ఒక్కక్షణం కళ్లు మూసుకొని నుదుటి మీద వేళ్లు తాటించాడు రామారావు.

"వాళ్ళకి కావలసిన దానికంటే ఎక్కువే యిచ్చి పెళ్ళి చేద్దాం!" అన్నాడు.

ఆశ్చర్యంతో నోరు తెరిచేసింది భార్యామణి.

కాసేపటికి తేరుకుని, "ఎలా..?" అని అడిగింది.

"చూద్దువు గాని!" అంటూ బయటకు వెళ్లాడు రామారావు.

మర్నాడే డైరీ కార్పొరేషన్‌లో ఒక ప్రపోజల్ తయారయింది. బాటిల్స్‌లో పాలు సప్లయి చేస్తూండడం వల్ల కల్తీకి అవకాశం బాగా ఉంటోందట. అందువల్ల పాలిథిన్ కవర్లలో పాలు సప్లయి చేయాలని నిర్ణయించారు. వెంటనే అందరి టెండర్లను పిలిచారు.

నారాయణరావుగారి అబ్బాయి నరహరి నష్టాలతో నడుస్తున్న తన పాలిథిన్ కవర్ల ఫ్యాక్టరీ తరపున బాగా తక్కువ రేట్లతో టెండర్ వేశాడు. టెండర్ అతనికే లభించింది. అంతే..! ఆ దెబ్బతో నెలకి లక్షలకొద్దీ పాల కవర్లను సప్లయి చేసే కంట్రాక్టుని పొందాడు.

చూస్తూండగానే లక్షలు సంపాదించే మార్గం మీదికి వచ్చాడు. అతనేమీ రామారావుకి బంధువు కాదు. అందువల్ల బంధుప్రీతి చూపించాడు... అని కిట్టనివాళ్ళు కూడా అనలేకపోయారు. ఆ తర్వాత- కొద్దినెలలకే నరహరితో రామారావుగారి అమ్మాయికి కాణీ కట్నం లేకుండా రంగరంగ వైభోగంగా వివాహం జరిగిపోయింది. అసలు... నరహరిచేత టెండరు వేయించమని నారాయణరావుగారితో ఉపాయకారిగా చెప్పింది రామారావు.

మరికొద్ది నెలలకి పాల పాకెట్ల మీద డైరీ కార్పొరేషన్ పేరు ముద్రించవలసిన అవసరం కనిపించింది కార్పొరేషన్ వారికి. వెంటనే ప్రపోజల్ తయారవడం, టెండర్లు ఖరారు అవడం.., సుబ్బయ్యగారి అబ్బాయి కాంతారావుకి కాంట్రాక్టు లభించడం జరిగిపోయాయి.

నరహరి సప్లయి చేసే కవర్ల మీద కాంతారావు అక్షరాలు ముద్రిస్తూ ఉంటాడు. ఈ సలహా సుబ్బయ్యకి చెప్పింది రామారావే. మరికొన్ని రోజులకే రామారావుగారి రెండో అమ్మాయికి కాంతారావుతో పైసా కట్నం లేకుండా ఘనంగా పెళ్ళి జరిగింది.

రామారావుగారూ, ఆయన అల్లుళ్ళూ ఆదర్శవాదులు. కట్నం అన్న ఊసే వాళ్ళెవరికీ రాదు. ఆయన కట్నం ఇవ్వడు, వీళ్ళు ఇచ్చినా పుచ్చుకోరు.

అలా ఆదర్శంగా వివాహాలు జరిపించేశాడు రామారావు.

– పల్లకి వార పత్రిక... *24 ఫిబ్రవరి '93*